సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

రోజూ అమావాస్యే..!

గ్రేటర్ విశాఖలో వీధి దీపాల నిర్వహణ గాడి తప్పుతోంది. జీవీఎంసీ చెప్పే మాటలకు..చేతలకు పొంతన ఉండడం లేదు. స్మార్ట్ సిటీ అంటూ ఊదరగొడుతున్న అధికారులు..కూటమి ప్రభుత్వం క్షేత్రస్థాయిలో సమస్యలు గాలికొదిలేసింది. కనీసం వీధి దీపాలు కూడా సక్రమంగా నిర్వహించకలేకపోతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీధి కుక్కల దాడులు పెరిగిపోతున్నాయి. ఆకతాయిల బెడద ఎక్కువైంది. గంజాయి బ్యాచ్ వీరంగానికి అంతేలేకుండా పోతోంది.



వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారంలో మల్కాపురం ప్రధాన రహదారి



మల్కాపురం పోలీస్‌స్టేషన్ నుంచి యారాడ వెళ్లే మార్గంలో..

- అంధకారంలో పారిశ్రామిక ప్రాంతం
- చీకట్లో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

సింధియా: కోరమాండల్, హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), షిప్‌యార్డ్, ఆంధ్రా పెట్రో కెమికల్స్ వంటి పరిశ్రమలు ఉన్న మల్కాపురం, సింధియా వంటి ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అక్కడి ప్రజలు, నేవీ సిబ్బంది, అటుగా ప్రయాణిస్తున్న ప్రయాణికులు రాత్రి వేళల్లో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా గాజువాక నుంచి మల్కాపురం మీదుగా సింధియా వెళ్లే ప్రయాణికులు, 40, 61, 62, 63, వార్డుల ప్రజలు 6 గంటలు దాటితే అంధకారంలో ప్రయాణాలు చేయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మల్కాపురం, సింధియా, క్రాంతినగర్, త్రినాథపురం, దుర్గానగర్, ప్రకాష్‌నగర్ వంటి ప్రాంతాల్లో సుమారు 80 వరకు వీధి దీపాలు పనిచేయడం లేదని, ఏడాది కాలంగా వీధి దీపాల నిర్వహణకు నోచుకోకపోవడంతో వీధుల్లో చీకట్లు అలుముకుంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకునేవారేరీ..

జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ నుంచి ఇటు మల్కాపురం పోలీస్‌స్టేషన్, అటు యారాడ మార్గాల వైపు వెళ్లాలంటేనే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఒక్క క్రాంతినగర్‌లోనే కాకుండా సింధియా నుంచి మల్కాపురం వరకు ఉన్న ప్రధాన రహదారిలో సైతం వీధిలైట్లు వెలగక నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో వీధిలైట్లు వెలగక పోవడంతో రహదారి మొత్తం చీకటిమయమై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరు టార్చిలైట్లు వెలుగుతో ప్రయాణిస్తున్నారు. వీధిదీపాలు లేకపోవడంతో పారిశ్రామిక ప్రాంతంలో చైన్ స్నాచింగ్, దొంగల భయం, వీధి కుక్కల దాడులు, గంజాయి బ్యాచుల వీరంగం, మందుబాబులతో హడలెత్తిపోతున్నారు. ఇంత జరుగుతున్న పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మల్కాపురం నుంచి సింధియా వరకు ప్రధాన మార్గంలో వీధి దీపాలు వెలగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చీకట్లో ప్రయాణం చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలి.

–సూరాడ పెంటారావు

వీధిదీపాలు నిత్యం వెలిగేలా చూడాలి



వార్డులో వీధిదీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. చీకట్లో ప్రయాణించాలంటే భయంగా ఉంది. రాత్రి సమయంలో బయటకు రావాలంటేనే భయమేస్తోంది. విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. వీధిదీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలి.

–రవి, కాకరలోవ

ఆత్మరక్షణ విద్య అవసరం



ఆత్మరక్షణ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

గోపాలపట్నం: ఆత్మరక్షణ విద్యలు నేటితరం విద్యార్థులకు అవసరమని నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ ప్రదీప్ అన్నారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మెళకువలు నేర్చుకోవడం అవసరమన్నారు. ఈ తరహా తరగతులు నిర్వహించేందుకు పీబీజీ చారిటబుల్ ట్రస్ట్ సంస్థ ప్రతినిధి పోలిశెట్టి వెంకట్ ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో చిట్టిమి వీరునాయుడు, దయాన తదితరులు పాల్గొన్నారు.

చట్టపరమైన దత్తతను ప్రోత్సహించాలి



ధ్రువీకరణ పత్రం అందిస్తున్న గొండు సీతారాం, తదితరులు

మర్రిపాలెం : అధికారిక, చట్టపరమైన దత్తతను ప్రోత్సహించాలని, ప్రభుత్వం రూపొందించిన కారా చట్టం ద్వారానే దత్తత తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారం అన్నారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ 53వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ సమీపంలో ఉన్న శిశు గృహలో మూడేళ్ల చిన్నారి (బాలిక)ని తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన మోహన్ రాజ్, సత్య దంపతులకు కారా చట్టాన్ని అనుసరించి అధికారికంగా అప్పగించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ అధికారిక దత్తత వల్ల పిల్లల భవిష్యత్ సురక్షితంగా ఉంటుందన్నారు. అనధికారికంగా చిన్నారులను దత్తత తీసుకోవడం ద్వారా కలిగే అనర్థాలపై విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. అధికారికంగా దత్తత తీసుకున్న తల్లిదండ్రులు సొంత బిడ్డల కంటే ఎక్కువ అభిమానంతో పిల్లలను పెంచి వారిని అన్ని విధాలా సంరక్షించాలని సూచించారు. కారా చట్టాన్ని అనుసరించి ప్రభుత్వ అధికారిక దత్తతల పైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి అధ్యక్షురాలు ఎంఆర్‌ఎల్ రాధ, సీడీపీవో రమణకుమారి, బాలల సంరక్షణ విభాగం పీవోఎన్ఐసీ మమత, కమిషన్ సభ్యులు రజని, విజయలక్ష్మి, సూర్యనారాయణ, లక్ష్మి, శిశు గృహ మేనేజర్ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మా పరిశ్రమల్లో జీరో స్థాయికి ప్రమాదాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



పాల్గొన్న భద్రత, తయారీ విభాగాల అధికారులు

- సేఫ్టీ వర్క్‌షాప్‌లో అధికారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ సూచన

పరవాడ: ఔషధ పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. జేఎన్ ఫార్మా సిటీలో మాన్యుఫాక్చరింగ్ అసోసియేషన్, మ్యూచువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మెడికేషన్ భవన సముదాయంలో ఏపీ పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రాసెస్ సేఫ్టీ వర్క్ షాప్‌లో పాల్గొని, ప్రసంగించారు. ఫార్మా పరిశ్రమల్లో పనిచేసే భద్రత, తయారీ విభాగాల అధికారులు ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. విధి నిర్వహణలో చాలా అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకురావాలన్నారు. రానున్న రోజుల్లో ప్రమాదరహిత ఉత్పత్తులను సాధించాలని సూచించారు. ఉద్యోగుల భద్రతకు పూర్తి ప్రాముఖ్యత కల్పించాలన్నారు. ప్రస్తుతం నిర్వహించిన ప్రాసెస్ సేఫ్టీ వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జీరో యాక్సిడెంట్ పరిశ్రమలుగా తీర్చిదిద్దడానికి జేఎన్‌పీసీ యాజమాన్యాలు కృషి చేయాలని ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు సూచించారు. జెట్టి సుబ్బారావుకు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ జ్ఞాపిక అందించి, సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీవీఎస్ నారాయణ, ఎస్వోహెచ్ఎస్ అధ్యక్షుడు రామసుబ్బారావు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌నకు హాజరైన భద్రత, తయారీ విభాగాధికారులకు జేసీఐఎఫ్ శివశంకర్‌రెడ్డి సర్టిఫికెట్లను అందించారు.

క్లుప్తంగా

చేపల మార్కెట్‌లో తనిఖీలు



గోపాలపట్నం చేపల బజారులో తనిఖీలు చేస్తున్న తూనికలు కొలతల విభాగం అధికారులు

గోపాలపట్నం: గోపాలపట్నం బంక్ వద్ద ఉన్న చేపల మార్కెట్‌లో తూనికలు కొలతల విభాగం అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. కిలోకి సుమారు 200 గ్రాములు తక్కువ తూకంతో అమ్మకాలు సాగిస్తున్నట్లు గుర్తించారు. బజారులో సుమారు 8 దుకాణ దారులపై కేసులు నమోదు చేశారు. లీగల్ మెట్రాలజీ జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఎం రాధా కృష్ణ మాట్లాడుతూ కొనుగోలు దారులు తూకాలను పరిశీలించి రీడింగ్ సున్నా ఉండేలా చూసుకోవాలని సూచించారు. చేపలు తూసేటప్పుడు నీరు చల్లడం ద్వారా తూకాల్లో బరువు పెరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి తూనిక యంత్రాలను గుర్తించి సీజ్ చేశామని తెలిపారు. తనిఖీల్లో అధికారి ఉమా సుందరి, సిబ్బంది పాల్గొన్నారు.

28న విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: ఆర్ఆర్ వెంకటాపురం, గోపాలపట్నం బంక్, ఎన్‌ఏడీ ఫీడర్లలో నిర్వహణ పనుల నేపథ్యంలో ఈ నెల 28న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరానగర్, రామకృష్ణ నగర్, లక్ష్మీనగర్ డి, ఈ బ్లాక్‌లు, గోపాలపట్నం మెయిన్ రోడ్డు, శ్రీనివాసనగర్, ఎన్‌ఏడీ కొత్త రోడ్డు, గాంధీనగర్, రెడ్డి వీధి, సుసర్ల కాలనీ, సీతారామరాజునగర్ తదితర ప్రాంతాలకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

2న ఐఎన్‌టీయూసీ సర్వసభ్య సమావేశం

మల్కాపురం : హిందుస్తాన్ షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ (గుర్తింపు యూనియన్), ఇందిరా ప్రియదర్శిని సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే నెల 2వ తేదీన మల్కాపురం మరడిమాంబ కల్యాణమండపం వద్ద సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమావేశం నిర్వహిస్తామని యూనియన్ ప్రతినిధులు తెలిపారు.


వైభవంగా పసుపతినాథ్ ఆలయ వార్షికోత్సవం

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు గణపతినగర్ కొండ ప్రాంతంలోని పసుపతినాథ్ ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పూజల్లో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పసుపతినాథుడిని విభూది,పంచామృతాలతో అభిషేకించారు. పూజల్లో కూటమి నాయకులు పుర్రె సురేష్‌యాదవ్,పాలిమేర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీలైనంత త్వరగా జీతాలు చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వీలైనంత త్వరగా జీతాలు చెల్లించాలని రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) మొహంతి ఆదేశించారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు జీతాలు సక్రమంగా చెల్లించకపోవడంపై స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ నాయకులు ఆర్ఎల్‌సీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన ఆర్ఎల్‌సీ మంగళవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్, ప్రధానకార్యదర్శి యు. రామస్వామి, యాజమాన్యం తరఫున ఫైనాన్స్ డీజీఎం రామ్‌ప్రసాద్, హెచ్ఆర్ మేనేజర్ వై.హెచ్. శంకర్ హాజరయ్యారు. దశల వారీగా జీతాలు చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ద్విచక్ర వాహనాల వేలం



వేలం నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పాత ద్విచక్ర వాహనాల వేలం నిర్వహించారు. గాజువాక అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు మధ్యవర్తుల సమక్షంలో సీఐ కేశవరావు ఆధ్వర్యంలో 25 వాహనాలకు రూ. 75 వేలు వచ్చింది. ఆ సొమ్మును ప్రభుత్వ ఖజానాలో జమ చేస్తామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ తాతారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయగౌరికి మొదటి ప్రాధాన్యం ఇవ్వండి

సీపీఎం నాయకుల విజ్ఞప్తి

మల్కాపురం: ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలు పట్టించుకోని ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవి రావు, ఎమ్మెల్సీ, మళ్లీ టీడీపీ మద్దతుతో బరిలో ఉన్న రఘువర్మ గ్రూప్–2 అభ్యర్థుల సమస్యలపై, జాబ్ క్యాలెండర్‌పై మాట్లాడగలరా అని సీపీఎం నాయకుడు ఉరుకూటి బాబూరావుయాదవ్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరికి మొదటి ప్రాధాన్యం కల్పించాలని ఆయన కోరారు. మల్కాపురం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజయగౌరి ఎమ్మెల్సీగా ఎన్నికైన మండలిలో ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై గళం విప్పుతారన్నారు. విజ్ఞులు ఆ దిశగా ఆలోచించాలని కోరారు. కూటమి బలపరిచిన వ్యక్తికి తొలి ప్రాధాన్యం కల్పిస్తే ఆ కూటమి నాయకులకు ఆయన సలామ్ చేయడం తప్పా మరేమి ఉండదన్నారు.

ఒత్తిడికి గురి కావొద్దు

డీఈవో ప్రేమ్‌కుమార్



కళ్లద్దాలు అందిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

అగనంపూడి: ఒత్తిడికి గురికాకుండా ఎక్కువ మార్కులు సాధించేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని డీఈవో ప్రేమ్‌కుమార్ అన్నారు. విద్యార్థులు ప్రశ్న పత్రాన్ని ఒకటికి రెండు సార్లు చదవి జవాబులు రాయాలని సూచించారు. అగనంపూడి పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారో ఆరా తీశారు. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి అగస్త్యా ల్యాబ్ సైన్స్ ఎక్స్‌పోలో ప్రతిభ చూపిన అగనంపూడి పాఠశాల విద్యార్థులు జల్లు జశ్వంత్, గరగ రోహిత్, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు కృష్ణవేణిని డీఈవో అభినందించారు. అలాగే మొహిసిన్ ఐ బ్యాంక్ నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య పరీక్షల్లో గుర్తించిన 34 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.కృష్ణారావు పాల్గొన్నారు.

ఘనంగా స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం



వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం స్టీల్‌ప్లాంట్‌లో ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ స్టోర్స్ సమీపంలోని యూనియన్ పాయింట్ వద్ద కేక్ కట్ చేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ కర్మాగార పరిరక్షణ, కార్మిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తున్నామన్నారు. యూనియన్ నాయకులు గొందేశి వెంకటరమణ, మార్టుపూడి పరదేశి, జి. అప్పలరెడ్డి, ఎన్. నూకరాజు, వి. అప్పలరెడ్డి, పిట్టారెడ్డి, బి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూల విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రగతిశీల మహిళా సంఘాల ప్రతినిధులు

సీతమ్మధార: మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలులో నిర్వహించనున్న రెండు ప్రగతిశీల మహిళా సంఘాల రాష్ట్ర స్థాయి విలీన సభను జయప్రదం చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకేఎస్ రోహిణి దేవి మీడియాతో మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని కోరుకునే ప్రతీ మహిళ స్మరించుకోవాల్సిన రోజైన మార్చి 8న ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో రెండు పీవోడబ్ల్యూలు ఏకమవుతాయన్నారు. పోరాటాల ద్వారానే హక్కులు సంక్రమిస్తాయన్నారు. జిల్లాలోని మహిళలందరూ ఒంగోలులో జరగనున్న రాష్ట్ర స్థాయి విలీన సభను జయప్రదం చేయాలని రోహిణి కోరారు. అదేవిధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పౌర గ్రంథాలయంలో జిల్లా స్థాయి సభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలోఏ పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, జిల్లా ఆఫీసు బేరర్ బాలనాగమ్మ, కార్యవర్గ సభ్యులు ఈసర లక్ష్మి, జయమ్మ పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణకు ప్రతిరూపం పరమశివుడు

డాబాగార్డెన్స్: ధర్మ పరిరక్షణకు ప్రతిరూపం పరమశివుడేనని, రుద్రభూమిలో ప్రత్యక్ష మైనప్పటికీ నిస్వార్థంగా లోకానికి వెలుగులు పంచేది కూడా ఆయనేనని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నేతృత్వంలో మంగళవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మహాశివరాత్రి వేడుకలు, శివ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నిస్వార్థ సేవలకు ప్రతిరూపం శివుడేనన్నారు. పరమ శివుడిని సేవా భావంతో స్మరించుకుంటే విజయాలు లభిస్తాయన్నారు. కార్యక్రమ నిర్వాహకురాలు బీకే రామేశ్వరి మాట్లాడుతూ మహా శివరాత్రి పర్వదినం లోకానికి అత్యంత పుణ్యప్రదంగా నిలుస్తుందన్నారు. శివుడిని పూజించే భక్తులందరికీ పాపాల నుంచి విముక్తి కల్పించడమే కాకుండా, మంచి జీవితాన్ని ప్రసాదించే మహిమ గల స్వామిగా అభివర్ణించారు. కార్యక్రమంలో గంట్ల శ్రీనుబాబు, ఆర్.నాగరాజ్ పట్నాయక్, పలువురు బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు ఓబీసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

ఉక్కునగరం: ఓబీసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అప్పారావు తెలిపారు. స్టీల్‌క్లబ్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన 4వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యాలయం ప్రాంగణంలో జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు నివేదిక అందజేశారు. కోశాధికారి ఉండవల్లి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో ధ్రువపత్రాలివ్వాలి

డాబాగార్డెన్స్: ప్రజలకు అందించే జనన, మరణ, కుల, వివాహ, ఆదాయ ధ్రువపత్రాలను ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు నిర్ణీత సమయంలో జారీ చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. వెంకటశేషమ్మ పేర్కొన్నారు. జీవీఎంసీ జోన్–4 సూర్యాబాగ్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయా ధ్రువపత్రాల జారీ ప్రక్రియపై జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రతో కలిసి మంగళవారం నిర్వహించిన సెన్సిటైజేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జనన, మరణ సర్టిఫికెట్లు జారీ చేసే విషయంలో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యంతో 6 నెలలకోసారి సెన్సిటైజేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ధ్రువపత్రాల జారీలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు.. అధికారులు, ఉద్యోగులకు సెన్సిటైజేషన్ కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–1,2,3,7 జోనల్ కమిషనర్లు, సహాయ వైద్యాధికారులు, స్టాటస్టికల్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.3.50 లక్షల అందజేత

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం ద్వారా బాధితులకు పరిహారం అందేవరకు అవసరమైన సహాయం అందజేస్తామని నగర పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సహాయ కేంద్రం ద్వారా తీసుకున్న చర్యల్లో భాగంగా ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో చనిపోయిన గొల్లవిల్లి అప్పారావుకు రూ.2 లక్షలు, తీవ్ర గాయాలపాలైన యస్.వీర్రాజు, సీహెచ్.కామేశ్వర్‌సాయి, నీలి రాజులకు ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున రూ.1.50 లక్షలు అందజేసి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని ఆయన తెలిపారు.

నాలుగేళ్ల తర్వాత తల్లి చెంతకు..



తల్లి కృష్ణాబాయ్‌తో వాసుదేవ్

సీతమ్మధార: మానసిక వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఏయూటీడీ సిబ్బంది చికిత్స అందించి తల్లి చెంతకు చేర్చారు. నాలుగేళ్ల తర్వాత తల్లీకుమారుడు కలుసుకున్నారు. మహారాష్ట్రలోని హింగోళి జిల్లా పరిధి గోరెగావ్ గ్రామానికి చెందిన వాసుదేవ్ మానసిక వ్యాధితో బాధపడడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం ఇంటి నుంచి వచ్చేసిన వాసుదేవ్ కొన్నాళ్లు వేర్వేరు ప్రాంతాల్లో తిరిగి గత ఏడాది అక్టోబర్ 5న విశాఖ చేరుకున్నాడు. అక్కడి జ్ఞానాపురం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తుండడంతో ఏయూటీడీ సిబ్బంది గుర్తించి టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని షెల్టర్ హోమ్‌కు తరలించారు. అనంతరం ఏయూటీడీ, శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు చికిత్స అందించారు. కోలుకున్నాక వాసుదేవ్‌ను స్వగ్రామం తీసుకెళ్లి తల్లి కృష్ణాబాయ్‌కు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. నాలుగేళ్ల తర్వాత కొడుకుని చూసిన ఆమె చాలా సంతోషించిందని తెలిపారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడీలు కీలకం



జ్ఞానజ్యోతి శిక్షణలో మాట్లాడుతున్న విజయభాస్కర్

పెందుర్తి: పిల్లల్లో సమగ్ర అభివృద్ధికోసం కృషి చేసేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇది మంచి అవకాశమని స్కూల్ ఎడ్యుకేషన్ జిల్లా ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు విజయభాస్కర్ అన్నారు. స్థానిక పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, ప్రసంగించారు. పిల్లలకు నేర్పే అంశాలు వారికి తెలియకుండానే వారి జ్ఞానాభివృద్ధికి తోడ్పడేలా కృషి చేయాలన్నారు. జిల్లా సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. పిల్లలకు ఆట పాటలతో కూడిన జ్ఞానాన్ని అందించాలన్నారు. ఆటల ఆధారిత అభ్యసన ప్రక్రియ ద్వారా పిల్లల్లో సమగ్రాభివృద్ధి జరిగి, గ్రేడ్ వన్‌లో ప్రవేశానికి సిద్ధం చేసే బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కె.సువర్ణ, పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ చిన్నమ్మాయి, రిసోర్స్ పర్సన్స్, ఐసీడీఎస్ సీడీపీవో ఎన్.నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: ఆస్తి, నీటి పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు. సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు, సెక్రటరీలకు, ట్యాక్స్ కలెక్టర్లకు మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డుల్లోని సచివాలయాల పరిధిలో సెక్రటరీలు, ఆర్ఐలు సిబ్బంది నిర్ణయించిన టార్గెట్లను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. పాత బకాయిలు, మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని, అప్పటికీ చెల్లించని పక్షంలో ఆస్తి జప్తు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పన్ను చెల్లింపులు చేసే వారి నుంచి చెక్‌లు తీసుకోకుండా డీడీలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్వోలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.